

ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావును కలిసిన తొర్రూరు న్యాయవాదులు

## ఎమ్మెల్సీని కలిసిన న్యాయవాదులు

తొర్రూరు, మే 6 : తొర్రూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావును మహబూబాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కోర్టుల ఏర్పాటు, కోర్టు అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించేలా చొరవ చూపాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అయిలినేని ముకుందారావు, కార్యదర్శి మైలపాక అశోక్, వైస్ ప్రెసిడెంట్ ఆర్కే ఘనపురం, న్యాయవాదులు వల్లపు మధుసూదన్, ప్రవీణ్ రాజు, వెంకటరత్నం, వల్లపు ఐలోని, బానోత్ లాలు, గోపాల్, ప్రవీణ్, యాకేందర్ పాల్గొన్నారు.

## పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

మహబూబాబాద్ రూరల్, మే 6 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని టీఎస్ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా భద్రీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుటాలు, జైళ్లకు భయకుండా కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత డీఏలు, పీఆర్సీ సక్రమంగా వచ్చిందన్నారు. కరోనా సమయంలో తప్ప మిగతా అన్ని వేళల్లో గత ప్రభుత్వం మొదటి తేదీనే వేతనాలు అందించిందన్నారు. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిందని, ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు ఇస్తున్నామని పదే పదే అనడం సరైంది కాదన్నారు. దేశంలోని మిగతా రాష్ట్రాల్లో ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీ సకాలంలో ఇస్తున్నప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఎందుకివ్వరని ప్రశ్నించారు. అనారోగ్యాల సమయంలో, పిల్లల పెండ్లి కోసం మా కష్టార్జితం నుంచి దాచి పెట్టుకున్న సొమ్మును కూడా పెండింగ్‌లో పెట్టి ఇబ్బంది పెట్టడం సరైందికాదన్నారు. గతంలో ఏ సీఎం కూడా ఇలా మాట్లాడలేదన్నారు. వెంటనే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### స్థాయికి తగని వ్యాఖ్యలు

ఉద్యోగులను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తన హోదాకు తగవని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించమని సీఎంను అడగడం సహజమని, సీఎం రేవంత్‌రెడ్డి అసహనంతో మాట్లాడటం సరి కాదన్నారు. ఉద్యోగులు, ప్రజలను వేరు చేసి మాట్లాడడం పద్ధతి కాదన్నారు. మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సునీల్, రమేశ్, విష్ణు, వీరేందర్ పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

కేసముద్రం, మే 6 : అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరుతూ మంగళవారం మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన పలువురు పేదలు ఎంపీడీవో క్రాంతికి వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ కమిటీలో ఉన్న సభ్యులు, గతంలో ఇల్లు తీసుకున్న వారికి, రేషన్ డీలర్‌కు, అంగన్‌వాడీ టీచర్‌కు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చారని ఆరోపించారు. నిరుపేదలకు మాత్రం ఇవ్వలేదని, విచారణ చేసి అర్హులకే ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజిత, అనిత, రమ, ఎల్లమ్మ, మమత, యమున, రజిత పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతి పత్రం అందిస్తున్న కాట్రపల్లి గ్రామస్తులు

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

నెల్లికుదురు : 20న జరగనున్న అఖిల భారత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పెరుమాండ్ల బాబుగౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశ వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికచట్టాలను రద్దు చేసి, కార్మికుల శ్రమను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నదన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక బిల్లును రద్దు చేయాలనే డిమాండ్‌తో చేపడుతున్నట్లు తెలిపారు. సీఐటీయూ నాయకులు బొల్లం ఎల్లయ్య, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



కేసముద్రం: మార్కెట్‌లో స్వల్పంగా తడిసిన ధాన్యం



దంతాలపల్లి : వేములపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అకాల వర్షానికి ధాన్యంపై కప్పిన టార్పాలిన్, వర్షపు నీటిని తొలగిస్తున్న రైతు

## భారీ వర్షం.. తడిసిన ధాన్యం

కేసముద్రం/దంతాలపల్లి, మే6 : అకాల వర్షాలు అన్నదాతలను ఆగం చేస్తున్నాయి. పగబట్టినట్లుగా వరుసగా కురుస్తున్న వానలతో వరి, మక్కజొన్న పంటలు దెబ్బతింటున్నాయి. చేతికొచ్చిన పంటఉత్పత్తులను మార్కెట్లకు తీసుకొచ్చి తేమ శాతం తగ్గడం కోసం ఆరబోస్తున్నారు. ఈ క్రమంలో ప్రతి రోజూ సాయంత్రం వేళలో వర్షం కురవడంతో ధాన్యాన్ని కుప్పపోయడం, మళ్లీ ఉదయం ఆరబోయడం.. రైతులకు రోజూ ఇదే పనిగా మా రింది. కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో కాంటాలు పెట్టకపోవడంతో 15 రోజులుగా రైతులకు ఇదే పరిస్థితి ఎదురవుతున్నది. సోమవారం రాత్రి వీచిన గాలి వానకు కొనుగోలు కేంద్రా ల్లో నిల్వ చేసిన ధాన్యం స్వల్పంగా తడిసింది. రైతులు ముందస్తుగా ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పడంతో కొద్దిగా తడవగా, మళ్లీ ఉదయం ఆరబోశారు.

# విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

**భద్రతా వారోత్సవాల్లో ఎన్‌పీడీసీఎల్ డీఈ మధుసూదన్**



ఎర్రబెల్లిగూడెంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎన్‌పీడీసీఎల్ డీఈ

నెల్లికుదురు, మే 6 : విద్యుత్ సరఫరా, వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాలని ఎన్‌పీడీసీఎల్ డీఈ మధుసూదన్ అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా నెల్లికుదురు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి ఎర్రబెల్లి గూడెం రైతు వేదికలో మంగళవారం రైతులు, ఎన్‌పీడీసీఎల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారోత్సవాల వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఎన్‌పీడీసీఎల్ తొర్రూరు ఏడీ ఛత్రపతిరావు, ఏఈతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగంలో రైతులు, ప్రజలు, విద్యుత్ సరఫరా, మరమ్మతు పనుల్లో సిబ్బంది తప్పకుండా భద్రత సూత్రాలను పాటించి, తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలన్నా రు. అనంతరం రైతులను కరెంటు సమస్యలు అడిగి తెలుసుకొని, వాటిని తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ తొర్రూరు ఏడీ ఛత్రపతిరావు, విద్యుత్ శాఖ నెల్లికుదురు ఏఈ సింధు, మునిగలవీడు సబ్‌స్టేషన్ ఏఈ భార్గవి, లైన్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణ్, రాజయ్య, లైన్‌మెన్లు కనకాచారి, మంగీలాల్, తదితరులు పాల్గొన్నారు.

### అధికారులకు సమాచారం అందించాలి

కేసముద్రం, మే 6 : ఇంట్లో, వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ సమస్యలు ఉంటే ఎవరికి వారు పరిష్కరించుకొనే ప్రయత్నం చేసి, ప్రమాదాలకు గురి కావొద్దని విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ట్రాన్స్ కో డీఈ విజయ్‌కుమార్ అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంట్లో, వ్యవసాయ బావుల వద్ద ఎర్త్ తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంటి వద్ద బట్టలు ఆరవేయడానికి ఇనుప తీగను వాడొద్దని, వానాకాలంలో విద్యుత్ స్తంభాలను తాకొద్దన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డీఈ పెద్ది రాజు, ఏడీఏ ప్రశాంత్, ఏఈ కుదరుపాక రాజు, సబ్ ఇంజినీర్ కరుణాకర్ పాల్గొన్నారు.

### బాధ్యతతో వ్యవహరించాలి

గూడూరు, మే 6 : విద్యుత్ సిబ్బంది బాధ్యతతో వ్యవహరించాలని విద్యుత్ శాఖ డీఈలు పెద్దిరాజం, విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎల్‌సీ తీసుకునే సమయంలో తొందరపడొద్దని, సేఫ్టీ పరికరాలను వినియోగించాలని, నాణ్యమైన నిరంతర విద్యుత్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యుత్ భద్రత, పొదుపు సూత్రాలను వివరించే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఈడీ కే కవిత, ఏఈ ప్రణీత్, సబ్ ఇంజినీర్లు లక్ష్మణ్, మేతురాం పాల్గొన్నారు.



కురవి: బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేస్తున్న రామారావు

## ఐదు కుటుంబాలకు రూ.50వేల ఆర్థికసాయం అందజేత

కురవి, మే 6 : రాజోలు శివారు హరియాతండాలో ఇటీవల గాలివాన బీభత్సానికి ఇండ్లు కూలిపోయిన ఐదు కుటుంబాలకు డోర్నకల్ విజయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాలోత్ రామారావు మంగళవారం రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షానికి హరియాతండాలో బానోత్ అచ్చి, భూక్యా సూర్య, బానోత్ పార్వతి, మాలోత్ శ్రీధర్, జర్పుల హునికి చెందిన ఇండ్లు కూలిపోయాయి. విషయం తెలుసుకున్న విజయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మా లోత్ రామారావు తండాకు చేరుకొని గిరిజన కుటుంబాల దీనస్థితిని చూసి చలించిపో యి ఒక్కోకుటుంబానికి రూ.10 వేల చొప్పున రూ.50వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో భూక్యా ప్రసాద్, భూక్యా దాము, రాజ్‌పుత్, తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

## జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం

బయ్యారం, మే 6 : మండలంలోని కంబాలపల్లి గ్రామంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ మంగళవారం నిర్వాహకులు ప్రారంభించారు. ప్రథమ బహుమతి రూ.20,016, ద్వితీయ బహుమతి రూ.15,016, తృతీయ రూ.10,016, చతుర్థ రూ.8,016గా నిర్ణయించారు. ఈ టోర్నీకి ఏజెన్సీలోని యువకులు పెద్దఎత్తున హాజరయ్యారు. క్రీడల్లో పాల్గొనే వారు కమిటీని సంప్రదించాలని నిర్వాహకులు అనిల్, వినోద్, మురళి, సురేశ్, రమేశ్ సూచించారు.

## సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి

నర్సింహులపేట, మే 6: ఆయిల్‌పామ్, కూరగాయాలు, పూల సాగులో రైతులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు డివిజన్ ఉద్యాన అధికారి శాంతిప్రియదర్శిని అన్నారు. మంగళవారం ఆయన బొజ్జన్నపేట గ్రామంలో అయిల్‌పామ్ తోటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఉద్యాన పంటలు మామిడి, జామ, నిమ్మ తోటలకు రూ.40 శాతం, బంతి, చామంతిపై 50శాతం, తీగజాతి కూరగాయాల కోసం పర్మినెంట్ పండాల్స్ కోసం 50శాతం సబ్సిడీపై రూ.50వేలు అరఎకరానికి అందించడం జరుగుతుందన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED

jobs Apply Now!

★Urgent requirement for ICICI, HDFC, AXIS INDUSIND BANK'S LOANS. DSA EXP. & FRESHER FEMALE TELE-CALLERS SAL.+INC.etc... JOB LOCATION: HNK CONT: +91 9182172367.
NTW-7711

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# భగ్గుమన్న కాంగ్రెస్ వర్గపోరు

**రాజులకొత్తపల్లిలో ఏకపక్షంగా ఇందిరమ్మ ఇండ్ల జాబితా, పార్టీలోని రెండు వర్గాల మధ్య ఘర్షణ**

నెల్లికుదురు, మే 6 : మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రాజులకొత్తపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో కాంగ్రెస్ వర్గ పోరు భగ్గుమన్నది. గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై భీం.. జై బాపు. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాపై ఎంపీ, ఎమ్మెల్యే వర్గాల మధ్య చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. ఇందిరమ్మ కమిటీ ఏకపక్షంగా లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసిందని, అర్హులకు మొండిచెయ్యి చూపి అనర్హులకు పెద్దపీట వేశారని ఓ వర్గం వారు ఆరోపించారు. ఇందిరమ్మ కమిటీ వారి వర్గీయులకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చిందని, పూర్తిగా ఇండ్లు లేని వారిని, మరో వర్గం వారిని విస్మరించిందని ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి.



రాజులకొత్తపల్లిలో ఇందిరమ ఇండ్ల జాబితాపై ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు



డోర్నకల్: మాట్లాడుతున్న హెచ్‌ఎం బండి నరసింహారావు



నర్సింహులపేటలో సమ్మర్ క్యాంపు ప్రారంభిస్తున్న ఎంఈవో



నెల్లికుదురు: ఆలేరులో శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో

# సమ్మర్ క్యాంపులతో ఎంతో మేలు

**విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి**

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పలువురు ఎంఈవోలు, హెచ్‌ఎంలు వీటిని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి ఉదయం 10.30 గంటలకు తరగతులు ఉంటాయని, నిపుణులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తామన్నారు. కంప్యూటర్ శిక్షణ, క్రాఫ్ట్, ఆర్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆటలు, పాటలు, ఇండోర్ గేమ్స్ తదితర కార్యక్రమాలు ఉంటాయని, విద్యార్థులకు స్నాక్స్ కూడా అందజేస్తారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేసముద్రం మండలం స్టేషన్, విలేజ్ ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంలు రాజు, వెంకట్రామనర్సయ్య సమ్మర్ క్యాంపులను ప్రారంభించారు. గూడూరు మండలంలోని గూడూరు, అయోధ్యపురం, పొనుగోడు ప్రభుత్వ పాఠశాలల్లో ఎంఈవో రవికుమార్, పెద్దవంగర మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంఈవో బీ శ్రీనివాస్, మరిపెడ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ సైదులు, ఎంఈవో అనితాదేవి, కురవి మండలంలోని కురవి, రాజోలు, మోద్గులగూడెం గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులను మంగళవారం హెచ్‌ఎంలు వహీద్, సత్యనారాయణాచారి, ఆళ్ల రవికుమార్, మహబూబాబాద్ పట్టణంలో వేసవి శిక్షణ తరగతులను జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి, నర్సింహులపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో రామ్మోహన్‌రావు, దంతాలపల్లి మండలంలోని దంతాలపల్లి, పెద్దముప్పారం, దాట్ల పాఠశాలల్లో వేసవి శిక్షణ తరగతులను ఆర్డీవో గణేశ్, పెద్దముప్పారం పాఠశాలలో ఎంఈవో శ్రీదేవి, నెల్లికుదురు మండలం కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లోని హైస్కూళ్లలో మండల విద్యాశాఖ అధికారి రాందాస్, హెచ్‌ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభించారు.

## 20 నుంచి ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలు

మహబూబాబాద్ రూరల్ : అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ సెమిస్టర్ పరీక్షలు జూన్ 20 నుంచి ప్రారంభమవుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ మంగళవారం తెలిపారు. ఎగ్జామ్ ఫీజ్ ఈ నెల 30 వరకు చెల్లించాలని, రూ.500 అపరాధ రుసుముతో జూన్ 5 వరకు చెల్లించే అవకాశం ఉందన్నారు. మరింత సమాచారం కోసం 73829297705 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## బీజేపీవి కార్మిక వ్యతిరేక విధానాలు

మహబూబాబాద్ రూరల్, మే 6 : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సీఐటీయూ పట్టణ నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న అన్నారు. మంగళవారం మండలంలోని కంబాలపల్లి పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం వైద్య రంగంలో కార్పొరేట్ శక్తులకు భాగస్వామ్యం కల్పిస్తూ ఆశ వర్కర్లకు కనీస వేతనాలు కూడా అందించడం లేదన్నారు. ఆశ వర్కర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అందించాలన్నారు. ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సావిత్రి, సునీత, సరిత, లక్ష్మి, సుభద్ర, గీత, తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

బయ్యారం:చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒడ్డుగూడేనికి చెందిన తాటి ముత్తయ్య ఈ నెల 3న ఆటోలో మహబూబాబాద్‌కు వెళ్తుండగా బయ్యారం మండలంలోని కొత్తపేటలో వద్ద కోతి ఎదురు రావడంతో పల్టీ కొట్టింది. ముత్తయ్యకు గాయాలు కాగా, ఖమ్మంలోని ఓ దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

### వడదెబ్బ తో మహిళ ..

మహబూబాబాద్ రూరల్ : వడదెబ్బతో మహిళ మృతి చెందిన ఘటన పట్టణంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని లెనిన్‌నగర్‌కు చెందిన తునికి అమరావతి(40) మంగళవారం మార్కెట్‌లో కూరగాయలు తీసుకొని ఇంటికి వచ్చింది. ఎండ తీవ్రతతో ఇంట్లో సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే భర్త సుధాకర్ గమనించి ఏరియా వైద్యశాల తరలిస్తుండగా మృతి చెందింది.

## అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

నర్సింహులపేట, మే 6: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. సీరోలు మండలం కొత్తూరుకు చెందిన విద్యాసాగర్(29)కు మూడేళ్ల కిత్రం నర్సింహులపేటకు చెందిన ప్రవళికతో వివాహం జరిగింది. అప్పటి నుంచి ఇక్కడే ఉంటూ మీ సేవ సెంటర్ నడిపిస్తున్నాడు. సెంటర్ సరిగ్గా నడవకపోవడంతో అప్పులు ఎక్కువై తీవ్ర మనస్తాపంతో సెంటర్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విద్యాసాగర్ తల్లి శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## 'మా సొమ్ము మాకు ఇవ్వండి'..

మరిపెడ: ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్ సొమ్ము, డీఏలు మా అవసరాలకు ఇవ్వాలని అడుగుతున్నామని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కుడితి ఉపేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం 14 నెలలుగా ఎదురుచూస్తున్నారని, ఈ ఆర్థిక సంవత్సరంలో క్లియర్ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు మాట మార్చి ప్రజల్లో ఉద్యోగులను పలుచన చేసేలా మాట్లాడడం విచారకరమన్నారు. ఈ సమావేశంలో పీఆర్టీయూ మరిపెడ మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగాల మహేశ్‌గౌడ్, బాధ్యులు దోమల లింగన్న, గండి కరుణాకర్, యాదగిరి, భరత్, హరి, వెంకటేశ్వర్లు, రవి పాల్గొన్నారు.

## సమ్మె నోటీసు అందజేత

కురవి, మే 6 : ఈనెల 20 జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు మండలంలోని బలపాల, కురవి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లకు సీఐటీయూ అనుబంధ ఆశవర్కర్స్ యూనియన్ నాయకులు మంగళవారం సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు పోతుగంటి మల్లయ్య, శిరసాని కాళేశ్వరి, కొప్పెర సుజిత, సంకూరు ఉపేంద్ర, దుండి హేమలత, విజయ, గొల్లపెల్లి శ్రీలత, కవిత, సరోజ, యాకమ్మ, నిర్మల పాల్గొన్నారు.

## కొనసాగుతున్న దీక్షలు

కురవి, మే 6 : గ్రీన్‌ఫీల్డ్ హైవేపై బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని మోద్గులగూడెం శివారు బేగావత్ తండా గ్రామస్తులు చేపట్టిన దీక్ష మంగళవారం కొనసాగింది. మాజీ ఎంపీటీసీ బాలాజీ మాట్లాడుతూ... తండాకు చెందిన రైతులు ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కర్నావత్ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ బేగావత్ తండా గ్రామ యూత్ అధ్యక్షుడు బాలాజీ, రవి, శంకర్, మోహన్, వినోద్ పాల్గొన్నారు.

## గడ్డివాము దగ్ధం

దంతాలపల్లి : ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డివాము దగ్ధమైన ఘటన మండలంలో మంగళవారం జరిగింది. వేములపల్లి గ్రామానికి చెందిన గుండగాని సైదులు పశువుల కోసం ఇంటి వద్ద నిల్వ ఉంచిన గడ్డివాముకు నిప్పంటుకొని మంటలు చెలరేగగా, గ్రామస్తులు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే 200 గడ్డి మోపులతోపాటు ఇంటి నిర్మాణం కోసం గడ్డిలో పెట్టిన తలుపు, కిటికీ చెక్కలు కాలిపోయాయి.

## స్పోర్ట్స్ మెటీరియల్ అందజేత

మహబూబాబాద్ రూరల్ : స్పోర్ట్స్ అథారిటీ తెలంగాణ జిల్లాల్లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపుల కోసం జిల్లాకు వచ్చిన మెటీరియల్‌ను మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో ఇన్‌చార్జిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవి కాలంలో తమ సమయాన్ని వృథా చేయకుండా సమ్మర్ క్యాంపుపై దృష్టి పెట్టి క్రీడల్లో నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్ మెటీరియల్‌ను ఇన్‌చార్జిలకు అందజేశా రు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

దంతాలపల్లి : భూ భారతి చట్టంపై గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. మంగళవారం కాల్వపల్లి, దాట్లలో నిర్వహించిన సదస్సులను ఆర్డీవో గణేశ్ ప్రారంభించి మాట్లాడారు. భూ సమస్యలుంటే రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాము పాల్గొన్నారు.

## సమ్మెను జయప్రదం చేయాలి

గార్ల : ఈ నెల 20న దేశ్యవ్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ముల్కనూర్ పీహెచ్‌సీ వద్ద ఆందోళన నిర్వహించి, వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేశారు. ఆశ వర్కర్లు సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు రమ, రమణ, కౌసల్య, సుజాత, ఉమ పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ఒకరి మృతి

కేసముద్రం : ఉప్పరపల్లి గ్రామంలో చీకటి లోకేశ్ (50) మద్యం మత్తులో పడుకొని మృతిచెంది ఉంటాడని ఎస్ఐ మురళీధర్ రాజు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. లోకేశ్ భార్య 10 ఏళ్ల క్రితం కుటుంబ కలహాలతో వెళ్లిపోయింది. ఈ క్రమంలో లోకేశ్ తాగుడుకు బానిసయ్యాడు.. చిన్న చిన్న పనులు చేసుకుంటూ మద్యం తాగుతూ ఇంట్లో ఒంటరిగానే ఉంటున్నాడు. మంగళవారం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో చుట్టు పక్కల వాళ్లు వెళ్లి చూడగా మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. తాగు నీరు తీసుకునే స్థితిలో లేకపోవడం లేదా గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.